క్లుప్తంగా

నమో శివరుద్రాయ



స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు ఉదయ్ కృష్ణశర్మ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం లో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు

సబ్బవరం: భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించడానికి పలు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఏర్పాట్లు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఎగుర వేస్తారని తహసీల్దార్ బి. సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొవాలని ఆయన కోరారు.

వంట పాత్రల వితరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అన్నప్రసాద పథకానికి సోమవారం అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కె.వి.నాగేశ్వరరావు వంట పాత్రలను అన్న ప్రసాద పథకం విభాగం అధికారులకు అందజేశారు. రూ.22 వేలతో వాటిని కొనుగోలు చేసినట్టు తెలిపారు.

ఎన్టీపీసీ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు వినతి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో ఈ నెల 10న జరిగిన ప్రమాదానికి సంబంధించి ఎన్టీపీసీ యాజమాన్యం, కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం ప్రమాదంలో మృతి చెందిన వారికి నష్ట పరిహారం చెల్లించకుండానే మృతదేహాలను ఇళ్లకు పంపించిందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

వేడుకగా వెంకన్న కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. చాతుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవిసమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'డిపెండెంట్స్'కు వైద్య సదుపాయాలపై వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులపై ఆధారపడిన కుటుంబ సభ్యుల (డిపెండెంట్స్)కు వైద్యం అందించే సమయంలో ఆస్పత్రి యాజమాన్యం సృష్టిస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండేను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిపెండెంట్ అని డిపార్ట్‌మెంట్ పర్సనల్ అధికారులు ధ్రువీకరించినా, ప్లాంట్ పర్సనల్ అధికారి ధ్రువీకరణ కావాలని వారు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్లాంట్ పర్సనల్ అధికారి సంతకం పెట్టేందుకు నిరాకరిస్తున్నారన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థపై పవన్‌కు ఆక్రోశం

- యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకో
- జన్మభూమి కమిటీలు చేసిన దోపిడీ గుర్తులేదా?
- వలంటీర్ వ్యవస్థను తొలగిస్తామని చెప్పగలవా
- పవన్ కల్యాణ్‌కు సవాల్ విసిరిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వలంటీర్ వ్యవస్థపై అక్కసుతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మండిపడ్డారు. సుజాతనగర్‌లో పర్యటించిన పవన్ వలంటీర్ల నుద్దేశించి చేసిన వ్యాఖ్యలను అదీప్‌రాజ్ ఖండించారు. సుజాతనగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అదీప్‌రాజ్ సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ఎంతో పటిష్టమైనదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా వలంటీర్లు అందించిన సేవలు అందరికీ గుర్తున్నాయని.. అలాంటి వలంటీర్లనుద్దేశించి పవన్ కల్యాణ్ నీచంగా మాట్లాడడం గర్హనీయమన్నారు. తప్పుడు ఆరోపణలు చేసి యువతను రెచ్చగొట్టాలని చూస్తే తగిన బుద్ధి చెప్తుతామని హెచ్చరించారు.

దిగజారుడు రాజకీయాలు మానుకో

సుజాతనగర్‌లో గత నెల 31న జరిగిన వరలక్ష్మి హత్యకేసులో నిందితుడు వెంకటేష్‌ను అంతక ముందే వలంటీర్ విధుల నుంచి తొలగించినా.. వలంటీరే హత్య చేశాడని పవన్ కల్యాణ్ అనడం ఆ వ్యవస్థపై అతనికి ఉన్న ఆక్రోశానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు వెంకటేష్‌పై ఫిర్యాదులు రావడంతో విధుల నుంచి తొలగించినట్టు అదీప్‌రాజ్ చెప్పారు. ఆ తర్వాతే అతను వరలక్ష్మి కుటుంబ సభ్యుల వద్ద పనికి చేరాడన్నారు. అవేవీ తెలుసుకోకుండా దిగుజారుడు రాజకీయాలు చేయడం తగదన్నారు. వరలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన పవన్‌కల్యాణ్ అరకులో బంగారం కోసం వృద్ధురాలిని హత్యచేస్తే మరి ఆమె కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో కాల్‌మనీ వేధింపులు జరిగినప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. జన్మభూమి కమిటీలు వేసేటప్పుడు వారి క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకుని నియమించారా.. అని ప్రశ్నించారు. పార్టీపరంగా వలంటీర్లను నియమించలేదని అదీప్‌రాజ్ స్పష్టం చేశారు. ఎక్కడో ఒకరో..ఇద్దరో తప్పు చేస్తే మొత్తం వ్యవస్థకు ఆపాదించడం సరికాదన్నారు. అసలు మీ ప్రభుత్వం వస్తే వలంటీర్ వ్యవస్థ లేకుండా చేస్తామన్న దమ్ము మీకుందా పవన్ కల్యాణ్ అని ప్రశ్నించారు. ఆ నినాదంతో మీరు ప్రజల్లోకి వెళ్లగలరా అని సవాల్ విసిరారు. వలంటీర్లు దండుపాళ్యం బ్యాచ్ అని పవన్ అనడంపై మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు.

రుషికొండపై అనవసర రాద్ధాంతం .. రుషికొండలో నిర్మిస్తున్న భవనాలపై పవన్ కల్యాణ్ లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కూడా ఏపీ టూరిజం రిసార్ట్స్ ఉండేవన్న విషయం తెలియదా అని ఎద్దేవా చేశారు. గీతం యూనివర్సిటీ, రామానాయుడు స్టూడియో ఎక్కడ ఉందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీని కొండ తవ్వేసి నిర్మించలేదా అని ప్రశ్నించారు. వీటిపై నోరు మెదపని పవన్ కల్యాణ్ సంక్షేమసారథి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడంతో ఆయన ఓర్వ లేని తనం బయట పడిందని ఆక్షేపించారు. తప్పుడు ప్రసంగాలతో యువతను కూడా పవన్ కల్యాణ్ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవిసాంబ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు బయిలపూడి భగవాన్ జయరామ్, పార్టీ పెందుర్తి మండల అధ్యక్షుడు సక్క కనకరాజు, నాయకులు ఆదిరెడ్డి మురళి, గొర్లె రాము నాయుడు, మధుపాడ అంజి, దాసరి సత్తిబాబు, అడ్డాల రామరాజు, గొర్లె అప్పారావు,వినోద్, చందు తదితరులు పాల్గొన్నారు.

'వారి పోరాటాలు స్ఫూర్తిదాయకం'



మొగలిపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, సచివాలయ సిబ్బంది,వలంటీర్లు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మొగలిపురంలోని మల్లునాయుడు చెరువు గట్టుపై సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామ పెద్దలు, నాయకులతో కలిసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గట్టుపై శిలాఫలకం ఆవిష్కరించి అనంతరం మట్టితో ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్య్ర సమరయోధులు,అమరవీరుల త్యాగాలు,దేశ సమైక్యత,సంస్కృతి,సాంప్రదాయాలు గురించి చర్చించారు. భావితరాలకు ఈ కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, టీడీపీ నాయకుడు గండి రవికుమార్, సచివాలయ కన్వీనర్ గండి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

వైభవంగా అన్నప్రసాద పథకం వార్షికోత్సవం



అన్నప్రసాద భవనంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకం వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 1989వ సంవత్సరంలో ప్రారంభమైన అన్నప్రసాద పథకం సోమవారం నాటికి 34 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అన్నప్రసాద భవనంలో వరాహ లక్ష్మీనృసింహస్వామికి అధికారులు, సిబ్బంది పూజలు నిర్వహించి హారతులిచ్చారు. చెక్కెర పొంగలి, పులిహోర ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. అన్నప్రసాద విభాగం ఏఈవో నరసింహరాజు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు, డీఈ నాగేశ్వరరావు, సిబ్బంది హరి పాల్గొన్నారు.

525 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన



జాతీయ జెండాతో ప్రదర్శన చేస్తున్న గొర్లె రామునాయుడు, విద్యార్థులు

సింహాచలం: ఎందరో ప్రాణత్యాగాల వల్లే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని పెందుర్తి అసెంబ్లీ నియోజకర్గ బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పెందుర్తి జంక్షన్ నుంచి పెందుర్తి జూనియర్ కళాశాల వరకు బీజేపీ ఆధ్వర్యంలో 525 అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 13 నుంచి 15వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరుగుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర సైనిక్ సెల్ కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, పెందుర్తి రూరల్ మండల అధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్, వేపగుంట అధ్యక్షుడు జయరాజు, లైన్స్ క్లబ్, హెల్త్ వెల్నెస్ క్లబ్ ప్రతినిధులు, ఆదర్శ్ డిగ్రీ కళాశాల, బాలాజీ కాలేజీ, అమృత నర్సింగ్ కాలేజ్, శాంతి నర్సింగ్ కళాశాల, ఆనంద సాయి జూనియర్ కళాశాల, కైట్స్ స్కిల్ ప్రైవేట్ లిమిటెడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అందరూ సోదర భావంతో మెలగాలి



విశ్రాంత సైనికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, సర్పంచ్ శిరీష



ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన, జోన్-8 కమిషనర్

సింహాచలం: పెందుర్తి మండలం రాంపురంలో సోమవారం నా మట్టి–నాదేశం, నేలతల్లికి వందనం–వీరులకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా జరిగిన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వాతంత్య్ర సమరయోధులు, వీరుల సంస్మరణ శిలాఫలకం ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలోని పదవీ విరమణ చేసిన సాయుధ దళాలకు చెందిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, రాంపురం సర్పంచ్ శిరీష, ఉప సర్పంచ్ కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రి నాయుడు, బాదిరెడ్డి కృష్ణ, రవి పాల్గొన్నారు.

జోన్–8 కార్యాలయంలో..

సింహాచలం: వేపగుంటలోని జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలు రకాల మొక్కలు నాటారు. అలాగే భారతదేశ అభివృద్ధిలో నావంతు బాధ్యత నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ చేశారు. అందరూ సోదర భావంతో మెలగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ శ్రీరామ్, నాయకుడు చందు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసంహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.

జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత మంజూరయ్యే రూ.20 లక్షలతో అవసరమైన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. జీవీఎంసీ నిధులతో ప్రధాన రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంరెడ్డి మహాలక్ష్మి నాయుడు, దాడి నూకరాజు, మల్ల రమణ, మల్ల నూక అప్పారావు, శరగడం జగదీష్, అప్పారావు, కొయిడాల రామసూరి, వేగి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



సత్తిబాబు(ఫైల్)

పరవాడ: దేశపాత్రునిపాలెంలో సెలూన్ షాపు నిర్వాహకుడు బి.సత్తిబాబు బలవన్మరణానికి పాల్పడినట్లు పరవాడ పోలీసులు చెప్పారు. ఎస్ఐ సిరపరపు సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం బుదిరెడ్లపాలేనికి చెందిన బయ్యవరపు సత్తిబాబు(30) తొమ్మిదేళ్ల కిందట దేశపాత్రునిపాలెం వలస వచ్చాడు. కొన్నాళ్ల పాటు స్థానికంగా ఉన్న సెలూన్ షాపుల్లో పనిచేసి వివాహం అనంతరం మెయిన్ రోడ్‌లో సొంతంగా సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. సత్తిబాబుకు భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పిల్లలను తీసుకొని అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సత్తిబాబు ఒక్కడే ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇదిలావుండగా సోమవారం మధ్యాహ్నం తలుపులు వేసి ఉన్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని సందర్శించిన పోలీసులు సత్తిబాబు కుటుంబ కలహాల వల్లే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్ఐ సురేష్ ఘటన స్థలాన్ని సందర్శించి క్లూస్‌టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీం బృందం నేర స్థలిలో వేలి ముద్రలను సేకరించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

పరవాడ: గాజువాక-యలమంచిలి రహదారిలో ఎకోనో హోటల్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి 9.30 గంటల సమయంలో ఆ వ్యక్తి రోడ్డు దాటుతుండగా లంకెలపాలెం నుంచి వచ్చిన భారీ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తికి వెల్లికిలా పడిపోయాడు. తలకు, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు క్షతగాత్రుడిని పరవాడ పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అపస్మారక స్థితిలో ఉండడం వల్ల వివరాలు తెలియరాలేదని పోలీసులు చెప్పారు. ప్రమాదానికి బొగ్గు లారీకారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

కొనసాగుతున్న శ్రావణ సంగీతోత్సవాలు



నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన వివంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శ్రీసరస్వతి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు వీణా వాయిద్యంతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మీనాక్షి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జాతీయ గీతాలాపన ఉంటుందన్నారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవం ప్రాముఖ్యతపై వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకూ ఉద్యమిస్తాం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించేంత వరకు ఉక్కు ఉద్యమం ఆపేది లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 914వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే వచ్చే లాభాలను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తూ కేంద్రప్రభుత్వం ఎందుకు సాధించలేదో తెలపాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విధి ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారం చేయడం కాదని, వాణిజ్యానికి ఊతమివ్వడమేనని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల మీద ఆధారపడి ఉన్న అనేక మంది కార్మికులు, శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితో కాలుష్యనియంత్రణ



ఆటోలో కార్యాలయానికి చేరుకున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని మేయర్, కమిషనర్ సూచించారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

అక్కిరెడ్డిపాలెం: రక్తదానం ప్రాణదానంతో సమానమని వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ఐలా భవనంలో ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా), ఏపీఐఐసీ–ఇండస్ట్రియల్ ఏరియాస్ లోకల్ అథారిటీస్, లఘు ఉద్యోగ భారతి సంయుక్తంగా రోటరీ బ్లడ్ సెంటర్, లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ రక్తదానం చేశారు. ఆయన ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యవంతులందరూ అపోహలు వీడి, రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం, ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, ఇన్‌చార్జి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఐలా డీ ఎక్స్‌పెన్షన్ మెంబర్ అశోక్ రాజు, లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, జిల్లా అధ్యక్షుడు అట్లూరి రమేష్, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, ప్రతినిధి అనార్‌బాబు, లయన్స్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.